క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 19వ వార్డులో రూ.3.90 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్.భవాని భూమిపూజ చేశారు. నిర్మాణ పనులను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాణిక్యం, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, ఎంఈ లీలాకృష్ణప్రసాద్, డీఈలు సుమ, సురేష్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీఐటీయూ కాలనీలో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్‌లైన్ పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పరిశీలించారు. పైప్‌లైన్ విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఆయన రాయల్ సర్కిల్, తిలక్‌నగర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.

నూతన కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సమితి రాష్ట్ర కార్యదర్శి హఫీజ్ అబ్దుల్ మాలిక్ తెలిపారు. శనివారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా షేక్ షర్ఫుద్దీన్, కార్యదర్శిగా పి.నౌషాద్, కోశాధికారి ఫయాజ్, సభ్యులుగా అక్బర్‌బాషా, అబ్దుల్‌రహిమాన్, రఫీఖ్, మునీర్ తదితరులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ మైనార్టీ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న చెంగలరాయుడు

యాడికి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తాడిపత్రి సహాయ వ్యవసాయ సంచాలకుడు చెంగలరాయుడు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఎరువుల దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. గోడాన్స్‌లో తనిఖీలు చేసి స్టాక్ రిజిష్టర్‌తో ఎరువుల బస్తాలను సరిచూసుకున్నారు. ఎరువులు, పురుగు మందులను రైతులకు విక్రయించేటప్పుడు బిల్లులు ఇవ్వాలన్నారు. అధిక ధరకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా విక్రేత అరెస్టు



స్వాధీనం చేసుకున్న టీవీఎస్ వాహనం, నాటుసారా చూపుతున్న సీఐ శివసాగర్, సిబ్బంది

గుంతకల్లు: నాటు సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, 20 లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. శనివారం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పులగుట్టపల్లి క్రాస్ తమ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా టీవీఎస్ మోపెడ్‌లో వస్తున్న పులగుట్టపల్లి పెద్దతండాకు చెందిన గౌరమ రవినాయక్‌ను ఆపి తనిఖీ చేశామన్నారు. ద్విచక్రవాహనంలో 20 లీటర్లు నాటు సారా ఉండడంతో అతడిని అరెస్టు చేశామన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశం, సుశీలమ్మ, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులు కుదేలు

- గాలీవానకు అపార నష్టం...
- పంట చేతికొచ్చే సమయంలో తుపాను
- అంచనాల తయారీలో అధికారులు



యల్లనూరులో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజా, ఏఓ రామకృష్ణుడు

యల్లనూరు: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన అన్నదాతలకు పెద్ద కష్టం వచ్చి పడింది. చేతికొచ్చే సమయంలో తుపాను వర్షాలకు నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు కోతలు కోసుకునే సమయంలో వరి పంట నేలపాలయిందని కన్నీంటిపర్యంతమయ్యారు. వరితోపాటు మొక్కజొన్న, జొన్న, అరటి పంటలు అక్కడక్కడ పాక్షికంగా దెబ్బతిన్నాయి. శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు, పుట్లూరు, నార్పల, బుక్కరాయ సముద్రం, శింగనమల, గార్లదిన్నె మండలాల్లో వందల హెక్టార్లల్లో వరి పంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు తెలిపారు. చేతికొచ్చిన పంటలు నేలవాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి కోత దశలో ఉన్న సమయంలో పంట నష్టం జరగడంతో రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూశారు.

అన్నదాతకు కోలుకోలేని దెబ్బ..

అన్నదాతలకు వరుస కరువులతో అల్లాడిపోతున్న సమయంలో ప్రకృతి కన్నెర్ర జేసింది. భారీ వర్షాలు, ఈదురుగాలులకు పచ్చని పంటలు, చేతికొచ్చిన పంటలు నేలకొరిగాయి. వరుసగా దెబ్బ మీద దెబ్బ పడుతుంటే అన్నదాత కోలుకోలేని స్థితిలో ఉన్నాడు. అప్పులు చేసి పంటలను సాగు చేస్తుంటే ఈ రూపంలో పంటనష్టం జరుగుతుందని భోరున విలపిస్తున్నారు. వరి పంట పూర్తిగా నేలవాలడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, అప్పులు ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. రైతులు సాగు చేసిన పంటలు కోత దశలో ఇలా జరగడం చాలా బాధకరమన్నారు. కాగా యల్లనూరు మండలంలో 25 మంది రైతులకు సంబంధించి 100 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగింది. అలాగే పుట్లూరు మండలంలో మొక్కజొన్న 220 ఎకరాలు, జొన్న 20 ఎకరాల్లో నష్టం వాటిల్లింది.

మండలం	వరి నష్టం అంచనా (హెక్టార్లలో)
శింగనమల	10
యల్లనూరు	40
గార్లదిన్నె	38

పరిహారం అందజేయాలి



ఒకటిన్నర ఎకరాలో వరి పంటను సాగు చేశా. పంట మొత్తం గాలికి పడిపోయింది. ఇప్పుడు కోసేందుకు కూడా వీలు కాలేదు. అప్పు చేసి పంటను సాగు చేశా. రూ.లక్ష నష్టం వచ్చింది. అధికారులు పంట నష్ట పరిహారం అందజేయాలి.కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి.

– చంద్రశేఖర్, రైతు, యల్లనూరు

అప్పులు మిగిలాయి



నాకున్న రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఈదురుగాలులకు వరి పంట మొత్తం పడిపోయింది. రూ.లక్షన్నర పంట నష్టం వచ్చింది. అప్పులు చేసి పంటలను సాగు చేస్తే ఆఖరికి అన్ని అప్పులే అయ్యాయి. జిల్లా అధికారులు న్యాయం చేయాలని.

– చిన్న ఓబులేసు, రైతు, యల్లనూరు

నివేదిక పంపాం



గాలీవానకు యల్లనూరు మండంలో 100 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. నష్టంపై తహసీల్దారు, వ్యవసాయ శాఖ అధికారుల అనుసంధానంతో నివేదికలను తయారు చేశాం. ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందితే రైతులకు న్యాయం చేస్తాం.

– రామకృష్ణుడు, వ్యవసాయాధికారి, యల్లనూరు

సీఎస్ఐ టౌన్ చర్చి శత వసంతాల వేడుకలు



సీఎస్ఐ టౌన్ చర్చిలో పాస్టర్లు, కమిటీ సభ్యులతో కలిసి సావనీర్ విడుదల చేస్తున్న బిషప్ ఐజక్ వరప్రసాద్

గుత్తి: పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చి శత వసంతాల వేడుకలను శనివారం సీఎస్ఐ టౌన్ చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ ఐజక్ వర ప్రసాద్, ఆయన సతీమణి భారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి శత వసంతాలకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సావనీర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ సీఎస్ఐ టౌన్ చర్చి నూరు వసంతాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కోలాటం పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం కూడా ఉత్సవాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ సాలోమన్, కమిటీ నాయకులు, సభ్యులు సురేంద్ర బాబు, రస్సెల్ కిరణ్, మనోరంజిత, జేమ్స్, దయానంద్,కిరణ్ సుశీల్ కుమార్, మాధురి దేవి, షీబా కవిత, వినోద్ పాల్, దివ్యతేజ, గ్రేస్ , విజయ కుమార్,నీలిమా ,ప్రేమ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

శింగనమల: యువత క్రీడల్లో రాణించాలని తరిమెల సర్పంచ్ ఓబిలేసు సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మహేష్, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు రాంభూపాల్ రెడ్డి, పీఈటీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రెండు ఎద్దులు, ఆవు దూడ అపహరణ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సంజీవనగర్ లో శనివారం గాయత్రీదేవి ఆలయం వెనుక నివాసమున్న రైతు సిద్దయ్యకు చెందిన రెండు ఎద్దులతో పాటు ఆవుదూడను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధిత రైతు మాట్లాడుతూ రాత్రి వర్షం పడటంతో ఇంట్లోకి వెళ్లి నిద్రించానన్నాడు. ఉదయం నిద్రలేచి చూసే సరికి పశువులు లేవన్నాడు. దాదాపు రూ. 3 లక్షల వరకు నష్టపోయినట్లు వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నాడు.

శివుడి విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జేసీ

తాడిపత్రి: తాడిపత్రి–అనంతపురం వెళ్లే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని సర్కిల్‌లో సుమారు రూ.20 లక్షల వ్యవయంతో 20 అడుగుల మహా శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం శనివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారులతో కలిసి విగ్రహం ఏర్పాటు చేయబోయే స్థలాన్ని పరిశీలించారు. రాజమండ్రికి చెందిన ప్రముఖ శిల్పి నరేంద్రకు విగ్రహాల తయారీ పనులు అప్పగించినట్లు తెలిసింది. మున్సిపల్ చైర్మన్ జేసీ తన సొంత ఖర్చు సుమారు రూ.70 లక్షల వ్యయంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వివిధ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.చుక్కలూరు రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో గ్రానైట్ కార్మికుడి విగ్రహం, నంద్యాల రోడ్డులోని సజ్జలదిన్నె సమీపంలోని పాత బ్రిడ్జి సమీపంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు సంబంధించిన గుర్తులను తెలిపే నమూనాలు, కడప రోడ్డులోని ఐశ్వర్య విల్లా సర్కిల్‌లో పచ్చదనం పరిడవిల్లే నమూనాలను ఏర్పాటు చేయనున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

తాడిపత్రిటౌన్/పెద్దవడుగూరు/గార్లదిన్నె: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అధికారి రవి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ ఉద్యమకారులైన డాక్టర్ ఎస్ఆర్ రాంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య తదితరులు గ్రంథాలయాల అభివృధికి చేసిన కృషిని కొనియాడారు. గ్రంథాలయాను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులోని గ్రంథాలయంలో వారోత్సవాలు న్విహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో గ్రంథాలయ అధికారిణి శిరీష, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తిలోత్తమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గుంతకల్లు: ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేకతను ఎండగడతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసెడెంట్ సురేష్, జిల్లా అధ్యక్షుడు రాజేషగౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ నాయకుడు శివారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామన్న హామీని విస్మరించారన్నారు. దీంతో అన్నదాతలు ఏడాదికి మూడు లక్షల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు రూ. లక్షల కోట్లు మాఫీ చేశారని గుర్తు చేశారు. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ముందస్తు సాగు సాయం కింద రైతులకు అందిస్తామని గొప్పలు చెప్పిందన్నారు. అయినా ఇప్పటి వరకూ పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, ఏపీ రైతు సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎస్ పారిశుధ్య కార్మికులు

శింగనమల(బుక్కరాయసముద్రం): మూడు నెలలు నుంచి జీతాలు రాలేదని , వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఎంపీడీఓ సల్మాన్‌రాజ్‌ను శనివారం పారిశుధ్య కార్మికులు కోరారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో వివిధ రకాల పనులు చేస్తున్నామని, కాని చేసిన పనికి సకాలంలో జీతాలు రావడం లేదన్నారు. పూట గడవడం కష్టంగా ఉందని, వెంటనే జీతాలు మంజూరు చేయాలని పారిశుధ్య కార్మికులు ఎర్రి నాగయ్య, పవన్, నాగేంద్ర, జయకుమార్, సీ నాగేంద్ర కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

గుంతకల్లు: భారతీయ సంస్కృతి, సంప్రదాలయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఎతిక్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు సంప్రదాయాలను ఉట్టిపడే వస్త్రధారణతో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



'గిరిజన తెగల హక్కులు–చట్టాల'పై మాట్లాడుతున్న వక్తలు

గుత్తి: చట్టాలు, హక్కులపై ఎస్సీ, ఎస్టీలు అవగాహన పెంచుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, సీఐడీ సీఐ ప్రసాదరావు, క్రైం సీఐ శ్రీనివాసరావు, సివిల్ సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా సూచించారు. గుత్తిలోని వసుధ ఫంక్షన్ హాల్లో శనివారం సీఐడీ ఆధ్వర్యంలో గిరిజన తెగల హక్కులు–చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం పెసా చట్టం, ఉప ప్రణాళిక చట్టం, అంటరానితనం నిర్మూలన చట్టం ఉన్నాయన్నారు. రాజ్యాంగం పరంగా రాష్ట్రపతి ప్రకటించిన ఎస్టీ జాబితాలకు భిన్నంగా ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చినా చెల్లవన్నారు. రాష్ట్రపతి ప్రకటించిన ఎస్టీ జాబితాలో పేర్లను మార్చు కోరుతూ లేదా రద్దు చేసేందుకు వేసే ఎలాంటి కేసులు కోర్టులు విచారించవన్నారు. గిరిజనుల కుల ధ్రువీకరణ పత్రాలు రద్దే చేసే అధికారం కలెక్టర్‌కు మాత్రమే ఉంటుందన్నారు. గిరిజనులను వివాహం చేసుకున్నంత మాత్రాన గిరిజనేతరుల కులం మారదన్నారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ శ్రావణి, ఎంఈఓ రవి నాయక్, ఏఎస్‌డబ్ల్యూఓ రాధిక, ఏఎస్ఐ నాగమాణిక్యం, గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే గోవిందు, మాజీ ఎంపీటీసీ గోవిందు, సర్వేశ్వర నాయక్, శంకర్‌నాయక్ , పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలి

గుంతకల్లు రూరల్: చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఇళ్ల స్థలాల కోసం ధర్నా చేపట్టనున్న నేపథ్యంలో శనివారం మండలంలోని కసాపురం గ్రామంలో కరపత్రాల పంపిణీని చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాము రాయల్ మాట్లాడారు. అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతోపాటు, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున అందజేస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

తాడిపత్రిటౌన్: విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా విజయనగరం లో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తాడిపత్రి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్ కోరారు. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో మహాసభలకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 27, 28, 29, 30 తేదీల్లో విజయనగరంలో మహాసభలు నిర్వహిస్తారన్నారు. విద్యారంగానికి కేంద్రం 10శాతం, రాష్ట్రం 30 శాతం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి నియోజకవర్గ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఓబులేసు, శివకృష్ణ, విజయ్, హరిష్, నాగార్జున, వెంకటేష్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠినచర్యలు



యల్లనూరులో మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

యల్లనూరు/తాడిపత్రిటౌన్/పెద్దవడుగూరు: గొడవలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. యల్లనూరు మండల కేంద్రంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పోలీసులు అనుమానితుల ఇళ్లు, గడ్డివాములు, రౌడీషీటర్ల ఇళ్లల్లో సోదాలను నిర్వహించారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా జీవించాలని సీఐ సూచించారు. మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యాకలాపాలకు ప్పాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యల్లనూరు ఎస్ఐ శ్రీరాం ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాతకూరగాయల మార్కెట్, చిన్నబజార్‌లో స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఏఎస్ఐ గోపాల్‌నాయుడు మాట్లాడుతూ గొడవలకు పాల్పడవద్దని హితవు పలికారు. అనంతరం ఆయా కాలనీల్లో రౌడీ షీటర్ల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పెద్దవడుగూరు మండలంలోని చిత్రచేడు, మేడిమాకుపల్లి, పెద్దవడుగూరు తదితర గ్రామాల్లో శనివారం ఎస్ఐ ఆంజినేయులు తన సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

అపార్ నమోదు వంద శాతం పూర్తి చేయాలి

గార్లదిన్నె: మండలంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల హెచ్ఎంలతో అపార్ ఐడీ క్రియేట్‌పై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రికార్డులు, ఆన్‌లైన్, ఆధార్ కార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా అపార్ ఐడీ క్రియేట్ చేయాలన్నారు. కార్య క్రమంలో ఎంఈఓ వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పామిడి: మండలంలోని పాళ్యంతండా గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సురేష్‌నాయక్‌ను శనివారం సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 8 క్వాటర్ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఐచర్ వాహనం బోల్తా

పామిడి: మండలంలోని పొగరూరు బ్రిడ్జి వద్ద శనివారం తెల్లవారుజామున ఐచర్ వాహనం బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వస్తువుల లోడ్‌తో వెళ్తున్న ఈ వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ రాజు, క్లీనర్ బాబు సురక్షితంగా బయటపడ్డారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పామిడి: పామిడి సబ్‌స్టేషన్‌లోని పీ కొత్తపల్లి ఫీడర్‌తో పాటు మండలంలోని ఎద్దులపల్లి, పాళ్యం సబ్‌స్టేషన్లలో 33/11 కేవీ లైన్ మెయింటెనెన్స్ వర్క్ జరుగుతోందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ మధుసూదన్ శనివారం తెలిపారు. అందులో భాగంగా ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

ఎంపీహెచ్ఈఓ చర్యలు తీసుకోండి

యాడికి: విధులకు సక్రమంగా హాజరుకాని రాయలచెరువు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలచెరువు పీహెచ్‌సీలో ఎంపీహెచ్ఈఓ గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ ఐదేళ్ల నుంచి డిప్యుటేషన్‌పై అనంతపురంలో విధులు నిర్వహిస్తున్నాడన్నారు. ఐదు నెలల క్రితం డిప్యుటేషన్ ముగిసినా ఆయన రాయలచెరువు పీహెచ్‌సీకి రాలేదని పలు వురు ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవరాజన్, అప్పయ్యను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం నుంచి ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ రాయలచెరువు ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాడని, శనివారం సెలవులో ఉన్నాడని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె: స్థానిక ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో సోషల్ టీజీటీ అతిథి ఉపాధ్యాయ పోస్టుకు అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ కోరారు.శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీఈడీ లో సోషల్ మెథడాలజీ చేసిన నిరుద్యోగులు అతిథి ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికై న వారికి నెలకు రూ.14,800 వేతనం ఇస్తామ న్నారు. వివరాలకు 8712625062 నంబర్‌లో సంప్రదించాలన్నారు.